# స్నేహబంధం

రచన:

"సువేణి"

"ఎంతపని చేశావు రాజ్యం; నీ కోసం నేను చేసిన త్యాగమంతా వృథా అయిపోయిందే!"

విచారంతో, బాధతో, నిరాశతో, స్నేహ చాలాసేపు పెనుగులాడింది.

చివరికి తెప్పరించుకొని లేచి గోడనవున్న రాము ఫొటోకు ఎర్రని గులాబి పువ్వులదండ వేసి అగరువత్తులు వెలిగించి ప్రక్కన గ్రుచ్చి "రామూ" అంటూ దుఃఖంతో ఆతని ఫొటోమీద వాలిపోయింది.

రాము, స్నేహ ఎంత గాఢంగా ప్రేమించుకున్నారో అంత విచిత్రంగా అంత బాధగా విడిపోయారు. బహుశః అంత ఎక్కువగా అంత నిర్మలంగా. అంత స్వార్థరహితంగా ప్రేమించుకున్నవాళ్ళు ఎలాగో ఒకలాగ ఎప్పుడో ఒకప్పుడు విడిపోక తప్పదేమో! కొంతమంది తల్లి దండ్రులచేత. కొందరు సంఘంచేత, కొందరు మూఢ ఆచారంచేత విడగొట్ట బడటం మామూలు. అనివార్య విధిచేత తమంతట తాము విడిపోవడం మరింత విషాదకరము.

స్నేహ చాలా అందమైంది. అందానికి తగిన తెలివి తేటలు సుగుణాలు కూడా ఆమెకు వున్నాయి. ఆమె, ఆమె తల్లి యిద్దరు మాత్రమే వుంటున్నారు తండ్రి ఆమె చిన్నతనంలోనే చనిపోయాడు. అప్పటినుంచి తల్లి పెంచి పెద్దదానిని చేసి చదువు చెప్పింది. స్నేహ ఇంటరు ప్యాసయి బి.ఏ. లోకి వచ్చింది.

స్నేహ యితరులను స్నేహం చేసుకోవడంలో చాలా గట్టిది. తన మంచి తనంవల్లనైతేనేమి, తెలివితేటలవల్లనైతేనేమి ఆమెకు అందరు అతి త్వరగా స్నేహితురాండ్రయ్యేవారు. ఆలాటి స్నేహితురాండ్ర మధ్యలో ఆమె సానుభూతిని పొందింది రాజ్యం.

పాపం, రాజ్యం ఒక బాల వితంతువు. పూర్వ సంప్రదాయం ప్రకారం ఆమెకు చిన్నప్పుడే— అంటే పన్నెండో ఏటే— పెండ్లి చేశారు. పెళ్ళి అయిన కొద్ది రోజులకే పాముకాటువల్ల చనిపోయినాడు పెండ్లికొడుకు. ఒక్కగాని ఒక్కకూతురు. ఆలా అవడం తల్లి భరించ లేకపోయింది. మనోవ్యాధితో ఆమె మంచం పట్టింది. ఏడాదికాకుండా రాజ్యాన్ని తండ్రికి అప్పగించి ఆమె పరలోకగతురాలైంది.

రాజ్యానికి తిరిగి వివాహం చేయడానికి తండ్రికి ధైర్యము చాలలేదు. చదువు చెప్పిస్తే తన బాధ కొంత మరచిపోవడానికి అవకాశముంటుందని ఆమెను చదువులో ప్రవేశపెట్టాడు. రాజ్యానికి చదువులో అంత ఆసక్తి లేదు. అయినా ఏడాది తర్వాత ఏడాది పైక్లాసులోకి వస్తూ బి.ఏ. లోకి వచ్చింది.

రాజ్యం ఎప్పుడూ చూసేందుకు విచారంగావుంటుంది. ఆమెను చూస్తే ఎటువంటి కఠినాత్మునికైనా కన్నీరు రాకమానదు. అతి సున్నిత హృదయంగల స్నేహ ఆమె స్థితికి జాలిపడటంలో ఆశ్చర్యమేమున్నది! ఆమె అందరికన్నా ఎక్కువగా ప్రేమించేది రాజ్యాన్ని. ఆమె విచారాన్ని మరచిపోయేట్టు చేయడానికి ఎన్నోకబుర్లు చెప్పేది. అనేకవిధాలుగా ధైర్యము, సంతోషము కలుగచేస్తూ వుండేది. రోజులు గడుస్తున్నకొద్దీ వాళ్ళిద్దరు ప్రాణస్నేహితులయ్యారు. ఒకరిని విడిచి ఒకరు వుండేవారు కాదు. శని ఆదివారాలలో ఒకరింటికి ఒకరు వస్తూ పోతూ వుండేవారు. అలాగే రోజులు గడిచిపోతున్నాయి. ఒకనాడు రాజ్యం అంది—

"స్నేహా, నీవు ఎప్పుడూ ఇలాగే నా మీద దయ చూపుతూ వుండగలవా?"

"అదేమిటి, రాజ్యం? అయినా నీకీ సందేహం ఎందుకు కలిగింది?"

మళ్ళీ ఏమీ మాట్లాడలేదు రాజ్యం.

వారి స్నేహాన్ని చూచి చాలా మందికి సంతోషంకంటె ఈర్ష్య ఎక్కువగా కలిగేది. ఒకరోజు స్నేహ రాజ్యం యింటికి వెళ్ళినప్పుడు రాజ్యం తండ్రి అన్నాడు:

"స్నేహా, నీ ధర్మమా అని మా రాజ్యం ముఖంలో నవ్వు చూస్తున్నాను" కృతజ్ఞత చూపుతూ అన్నాడు.

"నాదేముందండి! అయినా, రాజ్యం ప్రతిదానికి బాధ పడుతుంది." అంది నవ్వుతూ.

# స్నేహబంధం

"ఏమయితేనేమి, దానిని ఒకదారికి తెచ్చావు తల్లీ" ఈవిధంగా రాజ్యం తండ్రి స్నేహకు తన కృతజ్ఞత తెలుపుతూ ఆమెను పొగుడుతూవుండేవాడు.

రోజులు గడిచాయి. వాళ్ళు బి. ఏ. మొదటి సంవత్సరంనుంచి రెండో సంవత్సరంలోకి వచ్చారు. ఇంతలో వున్నట్లుండి స్నేహని ఒంటరిదాన్నిచేసి ఆమె తల్లి పరలోకం చేరింది. సముద్రం మధ్య ఏ ఆధారంలేక తుపానులో కొట్టుకుంటున్న నావలాగ అయిపోయింది స్నేహ. ఏసహాయంలేక నిలువునా కూలిపోతున్న సమయంలో రాజ్యం, ఆమె దూరబంధువు రాము ఆమెను ఆదుకొన్నారు. ఉన్న ఆస్తి దాయాదులకు పోకుండా, వాళ్ళవల్ల ఏబాధలూ కలగకుండా, రాము వచ్చి కాపాడాడు. నిజానికి రాముకు ఏమీ అవసరంలేదు. అతనికీ స్నేహకీ అంతకు ముందు ముఖపరిచయమైనాలేదు. కాని పురుషునిగా తన ధర్మం నిలుపుకొన్నాడు ఆమెను రక్షించి. ఆమె బాధ్యత తన మీద వేసుకొన్నాడు.

రెండు మూడు నెలలు గడిచాయి. అతను రోజూ వచ్చి ఆమె క్షేమ సమాచారాలను తెలుసుకొని పోతూ వుండేవాడు. ఆమెకు ధైర్యము, ఉత్సాహము కలుగచేస్తూ వుండేవాడు. రాము అంటే ఆమెకు అభిమానము ఏర్పడింది. ఒకరోజు రాముతో అంది-

"మీకెందుకు నావల్ల యింత శ్రమ ?"

"అదేమిటి స్నేహ ! శ్రమ అంటావేమిటి ! ఇదొక శ్రమా ? మగవాడినై పుట్టి నిస్సహాయ స్థితిలోవున్న ఒక స్త్రీకి ఈమాత్రం సాయం చేయకపోతే జన్మయెందుకు ? నాకు నీవు శ్రమయిస్తున్నావని నేనెప్పుడూ అనుకోలేదు."

ఆతని విశాల స్నేహ పూరిత హృదయాన్ని చూచి స్నేహ ముగ్ధురాలైంది. రోజులు గడిచినకొద్దీ వారిద్దరి మధ్య వున్న అభిమానము ప్రేమగా అభివృద్ధికాజొచ్చింది.

ఒకరోజు మాటల సందర్భంలో రాజ్యంతో స్నేహ అన్నది-

"రాజ్యం, కొద్దిరోజులలో రాముతో నాకు పెళ్ళి జరగబోతున్నది."

"ఆ ! నీకు రాముతో పెళ్ళా ! నిజం !" అన్నది రాజ్యం ఆశ్చర్యం చూపుతూ.

"అవును, రాజ్యం."

"నీవు అదృష్టవంతురాలివి స్నేహ. మంచి భర్త దొరకడానికి నిజంగా ఎంత గొప్పనోమో నోచుకొని పుట్టాలి. పెండ్లి అయినాక నన్ను మరిచిపోవు కదూ, స్నేహ ! నీవైనా వున్నావుకనుక నేను ఈ మాత్రంగానైనా వుండగలిగాను ఇప్పుడు నీవు కూడా నన్ను విడిచి పోతున్నావు. ఇక నాగతేమిటి ; అయినా నా పిచ్చికాని, ఎన్నాళ్ళని నీవు పెళ్ళి చేసుకోకుండా నాకోసం వుండిపోగలవు !" అని రాజ్యం వాపోయింది.

"ఏడుస్తున్నావా, రాజ్యం ! నీకింత బాధకలుగుతుందనుకోలేదు." అంటూ స్నేహ కూడా బాధపడింది.

ఇంటికొచ్చింది. ఆమె మనస్సంతా బాధతో నిండిపోయింది. నిజమే. తన స్నేహం వల్లనే తన సాహచర్యం వల్లనే రాజ్యం జీవింపగలుగుతున్నది. తను లేకపోతే ఆమె వుండలేదు. ఆమెను ఆదరించే వారు తానుకాక యింకెవరున్నారు ? తను పెళ్ళి చేసుకొని వెళ్ళిపోతే రాజ్యం జీవితం దుఃఖమయం అయిపోతుంది. నాశనమయిపోతుంది. అయితే ఆమెకోసం తను పెళ్ళి మానెయ్యాలా ! రాముతో తన భవిష్యత్తును గురించి ఎన్నో గాలి మేడలు కట్టుకున్నదే ! అవన్నీ ఇప్పుడు కూలిపోవలసిందేనా ! తన మధుర స్వప్నాలన్నీ స్వప్నగతి కావలసిందేనా ! తను రాముని విడిచి వుండగలదా ! తన జీవితమంతా నాశనముకావలసినదేనా !..... ............... అవును, విచార సముద్రంలోవున్న ఒక స్నేహితురాలి కోసం తను ఈమాత్రం త్యాగం చేయలేకపోతే స్నేహమంటే అర్థమేమిటి ?............. నిజమే. తన స్నేహితురాలికోసం తన సౌఖ్యం తాను త్యజించవలసినదే... ...కాని, కాని, తను దిక్కులేనిస్థితిలో వున్నప్పుడు తోడు నీడగావుండి తన్ను ఆదరించిన రాముని ప్రేమ త్యజించడం ధర్మమేనా ? అది కృతఘ్నత కాదా ? తనను విడిచి రాము జీవించగలడా ? ఒకవేళ జీవించినా అతనికి జీవితంలో సుఖం వుంటుందా ? .... ... ..... రాముని పెళ్ళి చేసుకోవలసిందే. అతని యెడల తన కృతజ్ఞత చూపి తన ప్రేమతో ఆతని జీవితము ఆనందమయముగా చేయడం తన ధర్మం........ ఛా. ఇది తన్ను తాను మోసపుచ్చుకోడమే. రాముతో తాను సుఖించడానికి చేస్తున్న తర్కమే యిది. లేకపోతే రాముకేమి ? అతడు

మగవాడు. కొద్దిరోజులలో తనను మరచిపోయి ఇంకొక అందమైన పిల్లను పెండ్లాడి సుఖంగా వుండగలడు. ఎటొచ్చీ ఆడదానికే కష్టంగాని మగవాడికేమి ? రాజ్యం ఎన్నికష్టాలో పడి పడి వున్నది. ఆడదైన తను రాజ్యానికి సానుభూతిచూపి, తన సుఖం త్యజించలేకపోతే తన జన్మ ఎందుకు ? తన చదువువల్ల ప్రయోజనమేమిటి ? ఎవరి సుఖం వారు చూసుకోడం సామాన్యమే. కాని తోటి స్త్రీ కోసం తన సుఖాన్ని త్యజించడంలోనేవున్నది నిజమైన గొప్పతనం. అని అనేకవిధాల తర్కించుకొని చివరకు మనసు దృఢం చేసుకొన్నది స్నేహ.

ఇంతలో రాము వస్తూ "స్నేహ, నీకొక సంతోష వార్త చెప్పనా ?" అన్నాడు వుత్సాహంతో.

"ఏమిటి రాము ?"

"మన ప్రేమలత పెరిగి పెద్దదయి వృక్షమై పువ్వులు కాయలు కాస్తుంది"

స్నేహ ఫక్కున నవ్వింది.

"ఏమి భావకవిత్వం రాము ! ఎక్కడయినా లత వృక్షమవుతుందా ?"

"ఎందుకుకాదు ? ఒకవేళ పూర్వంకాకపోతే యిప్పుడు చేసిచూపిద్దాం".

"పూర్వంకానిది యిప్పుడుమాత్రం ఎట్లా అవుతుంది ? ఎవరూ చేయలేనిది మనం చేయడానికి మన మే మయినా దిగివచ్చామా రామూ? "

"అదికాదు, స్నేహ, మనపెళ్ళికి మావాళ్ళు ఒప్పుకున్నారు. మన కోర్కెలు పండబోతున్నాయి. ఈ గులాబి పువ్వుచూడు ఎంతఅందంగా ఆనందదాయకంగావుందో!" స్నేహ తల వంచుకున్నది. ఆమెకండ్లు నీళ్ళతో నిండినయి, బొటనవ్రేలు నేలమీదరాస్తూ అన్నది :—

"రామూ, నిన్నొక్కటి అడుగుతాను చెప్పుతావా?"

"ఏమిటి?"

"ప్రేమ ఎక్కువా? స్నేహ మెక్కువా?"

"ఏమిప్రశ్న స్నేహ ! రెండు ఒకటేకదా!"

"అయితేభేదం లేదంటావా ?"

"కొంచమున్నదనుకో. ప్రేమలో స్నేహమున్నది. స్నేహంలో ప్రేమ వున్నది. కాని ప్రణయం లింగభేదం వల్ల ఏర్పడుతుంది. అది ప్రకృతితో సహకరించి భగవత్కార్యానికి తోడ్పడుతుంది. అందువల్ల స్నేహంకంటే ప్రేమే గొప్పది. నాస్నేహంలో రెండూమిళితమై వున్నాయి గనక ఆమె రెంటికంటే గొప్పది. రెంటికి అతీతమైంది కూడా !"

"అదిసరేగాని లింగభేదంవల్ల కలిగేప్రేమలో స్వార్థం వుందికదూ! "

"అపుననుకో. అయినా త్యాగాన్ని పురికొల్పడంలో ప్రేమకు పెట్టిందిపేరు కదా! "

"అయితే స్నేహం త్యాగాన్ని పురికొల్పదా? స్నేహం చేసే త్యాగం స్వార్థరహితంగనక ప్రేమకంటే స్నేహమే గొప్పదేమో! "

"స్నేహ, నేను మన పెళ్ళి విషయం మాట్లాడుతూ వుంటే ఇప్పుడు ఈ తర్క మీమాంసాలెందుకు ?"

"అదికాదు రాము. ఏదిగొప్పదైతే ఏంకాని, నేనిప్పుడు సంధిగ్ధావస్థలో పడ్డానురాము. నా మనసు పరిపరి విధాల పోతున్నది."

"ఏమిటిది స్నేహ?"

"రామూ" అన్నది. ఇకనోటివెంట మాట రాలేదు. జలజల కన్నీరు కారుతున్నది.

"ఏమిటిది స్నేహ? ఎందుకు ఏడుస్తున్నావు?" అన్నాడు రాము ఖంగారుగా.

"ఆ ! ఏమీలేదు....మనం పెళ్ళి మానుకోవాలి రాము! మనప్రేమ స్నేహంగానే వుండిపోవాలి. నాకు తెలుసు రాము నీవు నన్ను ఎంతగాఢంగా ప్రేమిస్తున్నావో అయినా ....అయినా ...నాకు హృదయం లేదనుకోకు రాము....నేనుకృతఘ్నురాల ననుకోకు రాము...రామూ, రామూ, నన్ను క్షమిస్తావుకదూ! " అంటూ వలవల ఏడ్చింది స్నేహ. రాముకు ఇదేమి అర్థంకాలేదు. రాతిబొమ్మలాగ నిలుమండ పోయాడు. ఒకనిమిషం — అది నిమిషమా యుగమా ?—పోయాక అన్నది స్నేహ:—

"నీకు రాజ్యం తెలుసుకదూ ! పాపం ఆమె జీవితమంతా దుఃఖమయం. ఆమెను ఒంటరిగా విడిచిపెట్టి నేను రాలేను రాము. "

# స్నేహ బంధం

"నా కేమీ అర్థం కావడంలేదు స్నేహ."

"బాల వితంతువైన నా స్నేహితురాలిని ఏకాకిగా వదిలివేసి నేను సుఖించలేను. రాము. నా హృదయం ఒప్పుకోడంలేదు, "

"పిచ్చిపిల్లా, నీవు పెళ్ళి చేసుకోకుండా వున్నంత మాత్రాన నీ స్నేహితురాలి దుఃఖం ఎట్లా వుపశమిస్తుందో నా కర్థం కావడంలేదు. నీ ప్రేమ, నీ సుఖం, నీ జీవితం నాశనం చేసుకోవడం నీ స్నేహితురాలికి యిష్టమేనా స్నేహ?"

"ఏమో రాము. నేనామెతో నా వుద్దేశం చెప్పలేదు. కాని నా పెండ్లిమాట చెప్పినప్పుడామెముఖం విచారంతో నిండిపోయింది. మబ్బు కమ్మిన ఆకాశంలా అయిపోయింది. "నీవుకూడా లేకపోతే నా గతేమయి పోతుంది" అని ఆమె బాధపడ్డది రాము. ఆ బాధ నా మనస్సును చీల్చివేసింది రాము. బాలవితంతువగు, శోకజీవియగు నా స్నేహితురాలి కోసం నన్ను ఈ చిన్న త్యాగం చేయనియ్యి. రాము."

"ఇది చిన్న విషయంకాదు. స్నేహ. నీ జీవితం బలి చేస్తూ ఇంకొకరి జీవితాన్ని కూడా నాశనం చేస్తున్నావు."

"కావచ్చుకాని, ఆమె అబల అని శోకజీవి అని జ్ఞాపకముంచుకో, రాము" అంటూ ఆతని వాడిలో తలపెట్టి వెక్కి-వెక్కి ఏడ్చింది స్నేహ. ఆమె తల నిమురుతూ రాము అన్నాడు. "ఇది నీవు చేయాలిసిందికాదు నామాట విను, దీనివల్ల ఎవరికి వుపయోగం లేకపోవడమే కాకుండా రెండు జీవితాలు నాశనమవుతాయి. బాగా ఆలోచించు, స్నేహ," ఆమె తలెత్తి అతన్ని చూస్తూ అంది.

"రామూ, నీవు నన్ను నిజంగా ప్రేమించే వాడివైతే నన్నీపనిని చేయనియ్యి. లోకంలో అన్నిటికన్నా గొప్పది స్నేహంకదూ!"

"రెండూ ఒకటే స్నేహ నీ విప్పుడు ఇద్దర్ని ప్రేమిస్తున్నావు. ఆ యిద్దరిలో జాతిపక్షపాతం చేత ఒకరికి మేలు చేయ్యాలని చూస్తున్నావు. కాని నీవు చేసేది అంత తెలివైన పనికాదు స్నేహ. ఒకవేళ రాజ్యం నిన్నంత ప్రేమించేదయితే నీ సుఖాన్ని చూచి సంతోషిస్తుంది కాని బాధ పడదు. అలా దుఃఖించే స్నేహితురాలి కోసం రెండు జీవితాల్ని నాశనం చేయడం తెలివైన పనికాదు, బాగా ఆలోచించు, స్నేహ."

"ఆలోచించుకున్నాను రాము. ఆమె ఏలాంటిదైనా ఆమె సుఖం కోసం నా స్నేహధర్మం నిలుపుకోతలచాను.

"స్నేహ. తొందర పడుతున్నావు. నేను లేనిది నీ వుండలేవు. నాప్రేమని నీప్రేమని ఇట్లా నాశనంచేయకు".

"అవును. నీవులేని లోకం నాకు శూన్యమే కాని నా స్నేహితురాలిలాగే నేను కూడా శూన్యంలోనే బ్రతుకుతాను. ఇప్పుడు నన్ను ఆపటానికి ప్రయత్నించకు రాము. నన్ను మరచిపో. ఇంకొక అమ్మాయిని పెళ్ళి చేసుకుని సుఖంగా వుండు. అదే నాకూ సుఖం". అంటూ స్నేహ అక్కడనుంచి వెళ్ళిపోయింది. రాము బరువు పాదాలతో వెళ్ళిపోయాడు. తిరిగి ఆమెకుకనబడలేదు.

ఆమె యిక ఆయింట్లో వుండలేక పోయింది. వేరే యిల్లు తీసుకుని అక్కడకువెళ్ళిపోయింది. మామూలుగా కాలేజికి వెళ్ళేది. మామూలుగా రాజ్యంతో మాట్లాడేది. మామూలుగానే అన్నీ జరుగుతున్నాయి. పరీక్షలువచ్చాయి అయిపోయినయి. రిజల్ట్సుకూడా వచ్చాయి. రాజ్యం ప్యాసయింది. స్నేహ ఫెయిలయింది, అయినా విచారించలేదామె. "ఎవరికోసం" అని నిట్టూర్చింది. ఆమె లోలోపలే బాధపడేది, ఆమెలోనిబాధ ఆమెనుమంచాన్ని పడేటట్టు చేసింది. పనిమనిషి వచ్చి పక్క సరిచేస్తూ "ఇదేమిటమ్మా" అంటూ ఒక కవరిచ్చింది. చింపి చదివింది. రాజ్యం రాసింది.

"స్నేహ, నా కోసం నీవు చాలా శ్రమ పడ్డావు. నా కోసం నీ పెళ్ళికూడా మానుకున్నావు. నేనేమి చేసికూడా నీ రుణం తీర్చుకోలేను. నాకుతెలుసు కాని నీ ఆదర్శానికి నే నందలేను. మా పక్కింటి అబ్బాయి గోపాల్ నీకు తెలుసనుకుంటాను. అతను నన్ను ప్రేమిస్తున్నాడు. నేను కూడా అతన్ని ప్రేమిస్తున్నాను. నేను తెలివి తక్కువగా చేసిన చిన్న పొరపాటు కోసం నా స్నేహాని విడిచి పెట్టాలిసి వస్తున్నది. నేనతనితో వెళ్ళిపోతున్నాను. త్వరలో నేను మాతృస్థానం వహిస్తున్నానని చెప్పటానికి సిగ్గుపడుతున్నాను. నాకోసం విచారించకు నన్నుక్షమించు.

ఇట్లు రాజ్యం"

ఆమె కండ్లు తిరిగిపోయాయి. కొంచెంసేపు మౌనంగా వుండిపోయింది. తర్వాత బొంగురు గొంతుతో ఎంతపని చేశావు రాజ్యం! నీ కోసం నేను చేసిన త్యాగమంతా వృధా అయిపోయింది గదా!" తర్వాత రాము ఫొటో వంక ఆమెకళ్ళు మళ్ళాయి. "చూశావా, నా మాట వినలేదానాడు"అన్నట్లు ఫోటోలోనుంచి రాము కళ్ళుపలికాయి.

"నన్ను క్షమించు రాము! నన్ను బంధించిన స్నేహ బంధం ఆమెను బంధించలేక పోయింది."